సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ౹ 8 ౹ జనవరి ౹ 2025



చీనీ టన్ను రూ.23,100
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100, కనిష్టంగా రూ.7,200 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.8°/11.2°

జిల్లా వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎండుమిర్చి క్వింటా రూ.16,500



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 137 మంది రైతులు 161 క్వింటాళ్ల మిర్చి తీసుకురాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహించినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ.16,500, రెండో రకం ఎండు మిర్చి క్వింటా రూ.9 వేలు, మూడో రకం క్వింటా ఎండుమిర్చి రూ.7 వేలు పలికాయి.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ ప్రధాన మందిరం సహా అదనపు భవన్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య మంగళవారం తెలిపారు. స్థాయీ సంఘం–1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రధాన మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. స్థాయీ సంఘం–3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు అదనపు భవన్‌లో ఆయా సంఘ అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర వివరాలతో సమావేశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

కదిరిలో నకిలీనోట్ల కలకలం

- పొట్టేళ్లు కొని నకిలీ నోట్లిచ్చిన కేటుగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు



నకిలీనోట్లు



రైతు నగేష్

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో కొందరు కేటుగాళ్లు రైతు నుంచి పొట్టేళ్లు కొనుగోలు చేసి నకిలీ కరెన్సీ నోట్లు అంటగట్టారు. అవి నకిలీ నోట్లని ఆలస్యంగా తెలుసుకున్న రైతు.. కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ముదిగుబ్బ మండలానికి చెందిన రైతు నగేష్ తన పొట్టేళ్లు అమ్ముకునేందుకు మంగళవారం కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చారు. ఇద్దరు యువకులు బేరమాడి నగేష్ వద్ద ఉన్న ఒక్కో పొట్టేలు రూ.16,250 చొప్పున రెండూ కలిపి రూ.32,500కు కొనుగోలు చేశారు. అనంతరం ఆయనకు డబ్బులిచ్చి పొట్టేళ్లు తీసుకువెళ్లారు. అనంతరం రైతు నగేష్ కదిరిలోని తన బంధువు వద్దకు వెళ్లి డబ్బు అతనికి ఇచ్చాడు. అయితే అవి నకిలీ నోట్లని గుర్తించిన అతను అదే విషయాన్ని రైతు నగేష్‌కు చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించి నగేష్ వెంటనే కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు మార్కెట్‌యార్డ్‌లోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా.. దుండగులు మాస్కులు ధరించి కనిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువు పొడిగింపు

ప్రశాంతి నిలయం: ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నంబర్ 265 విడుదల చేసినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. కులగణనపై వచ్చే అభ్యంతరాలను జనవరి 12వ తేదీ వరకు నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి స్వీకరిస్తారన్నారు. వాటిని జనవరి 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలన్నారు.

ఆస్పత్రిలో భయం.. భయం!



గర్భిణులు, బాలింతలు, పిల్లలకు టీకాలు వేసే గదిలోని పైకప్పు ఇలా...



ఆస్పత్రి భవనం పిల్లర్‌కు పగుళ్లు



పెచ్చులూడి పడుతున్న ఎమర్జెన్సీ గది పైకప్పు

ధర్మవరం.. పట్టుచీరతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. పట్టణ జనాభా 1.48 లక్షలు. ఇక పట్టు పరిశ్రమపై ఆధారపడి ఇక్కడ పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులూ వేలల్లోనే ఉంటారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, రాప్తాడు నియోజకవర్గంలోని మరో మూడు మండలాలకు ప్రధాన పట్టణం. ఆయా మండలాల్లోని నిరుపేదలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికే పరుగు తీస్తారు. కానీ శిథిల భవనంలో ఉన్న ఆస్పత్రి అటు రోగులను, ఇటు వైద్యులను భయపెడుతోంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దుస్థితి ఇది.

హా...స్పత్రి

- శిథిలావస్థలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రి భవనం
- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న రోగులు
- ఆస్పత్రికి వచ్చేందుకు జంకుతున్న వైద్యులు
- డోర్లు లేని మరుగుదొడ్లకు కర్టెన్ల ఏర్పాటు
- ఇదీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకాలోని ఆస్పత్రి దుస్థితి



విరిగిపోయిన తలుపునకు అట్టపెట్టెలు కట్టిన దృశ్యం

250	ధర్మవరం ఆస్పత్రి ఓపీ
40	ఆస్పత్రి ఐపీ
100	పడకల సంఖ్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ధర్మవరం పట్టణంతోపాటు ధర్మవరం మండలం, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, కొత్తచెరువు, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల నుంచి రోగులు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులు ధర్మవరం ఆసుపత్రికి వస్తుంటారు. కానీ ప్రస్తుతం ఆస్పత్రి నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థ చేరి పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో వైద్యులు, సిబ్బందితోపాటు రోగులు భయాందోళన చెందుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం కింద వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

వైఎస్సార్ సీపీ హయాంలో అప్‌గ్రేడ్

ధర్మవరం నియోజకవర్గంతో పాటు ఇటు రాప్తాడు నియోజకవర్గ వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 50 పడకలుగా ఉన్న ధర్మవరం ఏరియా ఆస్పత్రిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రి కొనసాగుతున్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఏరియా ఆస్పత్రిని దుర్గానగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన మాతాశిశు ఆస్పత్రి భవనాల్లోకి తరలించారు. శిథిలావస్థలో ఉన్న ఏరియా ఆస్పత్రి పాత భవనాన్ని తొలగించి 100 పడకలతో అధునాతనంగా నిర్మించేందుకు గత ఏడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. అయితే ఆ తర్వాత ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.



దోర్ లేని మరుగుదొడ్డికి కర్టెన్ వేసిన ఆస్పత్రి సిబ్బంది

భవనం మార్పుతో అష్టకష్టాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ధర్మవరం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న సత్యకుమార్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ధర్మవరం ఆస్పత్రికి మహర్దశ పడుతుందని అందరూ భావించారు. కానీ వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. మాతాశిశు ఆస్పత్రి భవనాల్లో నిర్వహిస్తున్న ఏరియా ఆస్పత్రిని కూటమి సర్కార్...మళ్లీ గతంలో ఉన్న శిథిల భవనానికి తరలించింది. ప్రస్తుతం ఆ భవనంలోనే ఆస్పత్రి కొనసాగుతోంది. పైకప్పులు ఊడిపడుతుండటంతో రోగులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తలుపులు, కిటికీలు, బాత్‌రూం డోర్లు విరిగిపోయాయి. వర్షం వస్తే ఆస్పత్రి మొత్తం కారుతోంది. మరుగుదొడ్ల డోర్లు విరిగిపోవడంతో కర్టెన్‌లు ఏర్పాటు చేశారు. మహిళలు బాత్‌రూం వెళ్లిన సమయంలో అక్కడ వారి బంధువులు కాపలాగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

మంత్రి సత్యకుమార్‌పైనే ఆశలు

ధర్మవరం నుంచి అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తన నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిపై ఇప్పటికైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. శిథిలావస్థ భవనంలో కొనసాగుతున్న ఆస్పత్రిని మరోచోటకు మార్చి...వెంటనే నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

టీడీపీ నాయకుడిపై కేసు

పుట్టపర్తి టౌన్: సుగాలీలను కులంపేరుతో దుర్భాషలాడిన ప్రశాంతి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గజ్జెల వెంకటరాముడుపై పుట్టపర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... బీడుపల్లి తండా, బ్రాహ్మణపల్లి తండా, ప్రశాంతి గ్రామం వద్ద ఉన్న తండా వాసులు పని నిమిత్తం నిత్యం పుట్టపర్తి సమీపంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్దకు వస్తుంటారు. ఆస్పత్రి సమీపంలోనే తిష్టవేసే టీడీపీ నాయకుడు, ప్రశాంతి గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి గజ్జెల వెంకటరాముడు కొన్ని రోజులుగా సుగాలీలను కులం పేరుతో దూషించే వాడు. అలాగే ఎయిర్ పోర్టు ఎదురుగా ఉన్న మూడు సెంట్ల ప్రభుత్వ భూమిని, కరెంట్ ఆఫీస్ వద్ద పడమటి భాగంలో ఉన్న 25 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. ఇలా... గజ్జెల వెంకటరాముడు చాలా కాలం నుంచి అధికారాన్ని అడ్డుపెట్టుకొని దాదాగిరి చేస్తున్నాడు. ఆయన ప్రవర్తనతో విసిగిపోయిన సుగాలీలు...సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్న వెంకటరాముడుపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఎస్పీ రత్న ఆదేశాలతో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ మంగళవారం విచారణ జరిపారు. అనంతరం డీఎస్పీ ఆదేశాలతో పుట్టపర్తి అర్బన్ పోలీసులు గజ్జెల వెంకటరాముడుపై కేసు నమోదు చేశారు.

'పది'లో సత్తా చాటాలి

- విద్యార్థులకు డీఈఓ కృష్ణప్ప సూచన



ధర్మవరం బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

ధర్మవరం రూరల్: జీవితంలో పదో తరగతి చాలా కీలకమైనదని, అందువల్ల పబ్లిక్ పరీక్షలకు బాగా సంసిద్ధులై మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన ధర్మవరం పట్టణంలోని పలు పాఠశాలలతో పాటు ఉప్పునేసినపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పథకం అమలును ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. పదో తరగతిలో వచ్చే మార్కులు చాలా కీలకమన్నారు. ఉపాధ్యాయులు కూడా పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల నిర్వహణ, చదువుపై ప్రగతి తదితర వాటిపై ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. డీఈఓ వెంట ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి, శైలజ, రాంప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ప్రహరీ కూలి విద్యార్థికి గాయాలు



పడిపోయిన పాఠశాల ప్రహరీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

లేపాక్షి: మండల పరిధిలోని కుర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలగా, ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు...కుర్లపల్లి గ్రామానికి చెందిన రమేష్, గౌతమిల కుమారుడు తనూష్ గ్రామంలోని పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థి మూత్ర విసర్జన కోసం ప్రహరీ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో శిథిలావస్థలో ఉన్న ప్రహరీ కూలిపోయింది. ఈ ఘటనలో తనూష్ ఎడమ కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పాఠశాల ఉపాధ్యాయులు తనూష్‌ను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ నాగరాజు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు.

నేడు జిల్లాలో కరువు బృందం పర్యటన

ప్రశాంతి నిలయం: కరువు పరిస్థితులు తెలుసుకునేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన ముగ్గురు సభ్యులతో కూడిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం బుధవారం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ దీప్‌శేఖర్ సింగల్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ నూనె విత్తనాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్.కె పొన్నుస్వామి, ఆహార ప్రజా పంపిణీ సంస్థ డైరెక్టర్ ప్రియా జాకబ్ తదితరులతో కూడిన కమిటీ సభ్యులు మంగళవారం రాత్రే ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్‌కు చేరుకున్నారు. అక్కడే వారికి బస సౌకర్యం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం వారు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి గత రబీలో దెబ్బతిన్న పంటలతో పాటు, బాధిత రైతులతో మాట్లాడనున్నారు.

కరువు బృందం పర్యటన సాగనుందిలా...

పంటల దిగుబడులు, కరువు పరిస్థితులను పరిశీలించేందుకు విచ్చేసిన కరువు బృందం సభ్యులు పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

- ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్‌లో బుధవారం ఉదయం 8.45 గంటలకు కరువు బృందం సభ్యులు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను జిల్లా వ్యవసాయ అధికారులు, ఉన్నతాధికారులు వివరించనున్నారు.
- ఉదయం 9 గంటలకు శాంతి భవన్ నుంచి బయలుదేరనున్న కరువు బృందం సభ్యులు 10 గంటలకు ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లికి చేరుకుని అక్కడ రైతులు సాగు చేసిన కంది, వేరుశనగ పంటలను పరిశీలిస్తారు. అనంతరం రైతులతో సమావేశమై చర్చిస్తారు.
- 11.30 గంటలకు జొన్నల కొత్తపల్లి నుంచి బయలుదేరి రామాపురం మీదుగా తాడిమర్రికి చేరుకుంటారు.
- 11.50 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు తాడిమర్రిలో ఉలవ, జొన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం రైతులతో సమావేశమవుతారు. అక్కడే ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్న భోజనం అనంతరం అక్కడి నుంచి అనంతపురం జిల్లాకు బయలుదేరి వెళ్తారు.

ఇస్లాం శాంతిని కాంక్షిస్తుంది



ఇస్తెమాకు హాజరైన ముస్లింలు



ఇస్తెమాలో ప్రసంగిస్తున్న మతపెద్ద

- పొరుగువారికి సాయంలో ముస్లింలు ముందుండాలి
- ఇస్తెమాలో మతపెద్దల ప్రవచనాలు

హిందూపురం: ఇస్లాం ప్రపంచ శాంతిని కాంక్షిస్తుందని, ఇస్లాంను అనుసరించే వారంతా సృష్టికర్త అల్లాహ్‌పై విశ్వాసంతో పాటు ఇతరుల పట్ల సోదరభావం కలిగి ఉండాలని మతపెద్దలు సూచించారు. గత రెండు రోజులుగా స్థానిక పరిగి రోడ్డులో నిర్వహిస్తున్న ఇస్తెమా మంగళవారం ముగిసింది. చివరి రోజు సాయంత్రం పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగాయి. ఢిల్లీ నుంచి విచ్చేసిన మత పెద్దలు భయాన్ (ప్రసంగాలు) చేశారు. సాయంత్రం ప్రత్యేక నమాజ్ చేసి ప్రసంగాలు, సందేశాలిచ్చారు. ఈ సందర్భంగా మతపెద్ద ఢిల్లీ హాజి ప్రసంగిస్తూ, అల్లాహ్ ఎదుట అందరూ సమానమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. దయ, దానం, భక్తిమార్గంతోనే అల్లాహ్ దరిచేరగలమని అన్నారు. దైవం పట్ల విశ్వాసం, నమ్మకంతో ప్రార్థనలు చేయాలన్నారు. ఉన్నంతలో కొంతభాగం ధాన ధర్మాలు చేయాలని, ఏ సమయంలోనైనా పొరుగువారికి సాయం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

భారీగా తరలివచ్చిన ముస్లింలు

ఇస్తెమాకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ముస్లింలు భారీ తరలివచ్చారు. మతపెద్దల ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు హాజి అతావుల్లా, ఆయుబ్, ఇబ్రహీం, సాదిక్ అమీన్, హుమాయూన్ తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు



డీలర్‌కు షోకాజ్ నోటీసు ఇస్తున్న అధికారులు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని పలు చౌకధాన్యపు దుకాణాల్లో మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కుటాగుళ్లలోని 22వ షాపు, అడపాలవీధిలోని 18వ నంబర్ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న నిల్వకు, రికార్డుల్లో నమోదు చేసిన స్టాక్‌కు వ్యత్యాసం ఉండటంతో డీలర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆర్డీఓ విచారణ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటారని విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీలో విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, డీసీటీఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమయపాలన విస్మరించిన 'కేకే'


కేకే ఎక్స్‌ప్రెస్ రైలు

పెనుకొండ రూరల్: న్యూఢిల్లీ నుంచి బెంగళూరుకు వెళ్లే కేకే (కర్ణాటక) ఎక్స్‌ప్రెస్ రైలు సమయపాలన పూర్తిగా విస్మరించింది. వాస్తవానికి ఉదయం 8.30 గంటలకు పెనుకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సిన ఈ రైలు వారం రోజులుగా మధ్యాహ్నానికి పైగా చేరుకుంటోంది. కొన్ని సందర్భాల్లో రాత్రి 8 గంటలకు పెనుకొండ చేరుకున్న సందర్భాలూ ఉన్నాయి. దీంతో పెనుకొండ నుంచి హిందూపురం, గౌరిబిదనూరు, చిక్‌బళ్లాపూర్ పట్టణాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. రోజూ పెనుకొండ నుంచి ఉద్యోగులతో పాటు ఇతర ప్రయాణికులు దాదాపు వంద మందికి పైగా కేకే ఎక్స్‌ప్రెస్ రైలులోనే ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు చొరవ తీసుకుని సకాలంలో కేకే ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

జెడ్పీటీసీలకు గౌరవవేతనం మంజూరు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని 63 మంది జెడ్పీటీసీలు, ఇద్దరు కో–ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం మంజూరైంది. 2024, మార్చి ఒకటి నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ సహా జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం మంజూరు కాలేదు. ఈ అంశంపై సమావేశాల్లో పలుమార్లు సభ్యులు జిల్లా స్థాయి అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో గౌరవవేతనం చెల్లింపులకు రూ.50 లక్షలు అవసరమని జెడ్పీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపగా... రూ.34 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మొత్తాన్ని ప్రజాప్రతినిధుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వేమన జయంతి ఉత్సవాలు ప్రారంభం


ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో వెలసిన యోగి వేమన ఆలయంలో జయంతి ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేమన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో స్వామి గొడుగుకు ప్రత్యేక పూజలు చేసి ప్రాకారోత్సవం, సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకున్నారు.

శిఖరాలే చిన్నబోయాయి

- ఎత్తయిన పర్వతాలను అధిరోహించిన పేదింటి బిడ్డలు

రాయదుర్గం: కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకున్నారు పేదింటి బిడ్డలు. ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించారు రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు.

ఎన్‌సీసీ ద్వారా అందివచ్చిన అవకాశం

రాయదుర్గంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో మైక్రోబయోలజీ ద్వితీయ ఏడాది చదువుతున్న యోగీశ్వరి, జి.గోపాల్ ఇద్దరూ పేదింటి నుంచి వచ్చారు. సాహస కృత్యాలు చేయడంతో పాటు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుంటూ వచ్చారు. తమ అభిరుచికి తగినట్లుగానే ఎన్‌సీసీ క్యాడెట్లుగా చేరి మరింత రాటుదేలారు. ఈ క్రమంలో ఇటీవల 15 రోజుల పాటు ఉత్తర కాశీలోని హిమాలయ పర్వతారోహణకు అర్హత సాధించారు.


పర్వతారోహణలో విద్యార్థి గోపాల్


ఎన్‌సీసీ క్యాడెట్లతో గోపాల్, యోగీశ్వరి (ఫైల్)

దేశవ్యాప్తంగా 17 ఎన్‌సీసీ కమాండెంట్లకు చెందిన క్యాడెట్లు హాజరు కాగా, ఏపీ తరఫున యోగీశ్వరి, గోపాల్ ఇద్దరే ఉండడం గమనార్హం. అన్నింటా వీరు ముందుంజలో ఉంటూ అగ్రస్థానంలో నిలిచి, కళాశాల ఖ్యాతిని చాటిచెప్పారు. ఈ నేపథ్యంలో తమ సాహస యాత్ర ముగించుకుని వచ్చిన విద్యార్థులను మేళతాళాల మధ్య కళాశాల గేటు నుంచి లోపలి వరకూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి, అధ్యాపకులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ పర్వతారోహణకు తొలిసారిగా తమ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రెండో బ్యాచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాన్న కల సాకారం చేయాలని



అనారోగ్యంతో మా నాన్న మరణించారు. శిఖరం ఎక్కేంత స్థాయికి నన్ను ఎదిగేలా చేస్తానని నాన్న అంటుండేవారు. ఆయన లేకపోయినా ఆయన కలను సాకారం చేయాలనే పట్టుదల నాలో పెరిగింది. దీంతో ఎన్‌సీసీలో చేరి తొలి ప్రయత్నంలోనే నాన్న కలను సాకారం చేయగలిగాను. జాతీయ స్థాయి పతకాన్ని సొంతం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఎం.యోగీశ్వరి, విద్యార్థిని, రాయదుర్గం

అనుకున్నది సాధించా



మాది సాధారణ రైతు కుటుంబం. అమ్మ, నాన్న పూర్తిగా నిరక్షరాస్యులు. వారి కష్టం నాకు రాకూడదని నన్ను చదివిస్తున్నారు. కొండలు ఎక్కడమంటే నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఎప్పటికైనా ఎత్తైన కొండలు ఎక్కకపోతానా అని అనుకునేవాడిని. ఇది సాధించాలంటే ఎన్‌సీసీ ఒక్కటే మార్గమనుకుని అందులో చేరాను. అనుకున్నట్లుగానే పర్వతారోహణకు ఎన్‌సీసీ కమాండెంట్లు ప్రతిపాదించిన పేర్లలో నన్నూ చేర్చారు. ఉత్తరకాశీలో పర్వతారోహణ కొత్త అనుభూతిని మిగిల్చింది. పతకం అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది. –జి.గోపాల్, విద్యార్థి, పల్లెపల్లి

రైతులను విస్మరిస్తే పుట్టగతులుండవు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య


విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

అనంతపురం అర్బన్: ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా కేవలం ప్రజల కోసమే వ్యవసాయం చేస్తున్న రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే పుట్టగతులుండవని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములుతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వంద మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతుల కుటుంబాలను పరామర్శించి సొంత నిధులతో ఆర్థిక సాయం చేసిన పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆత్మహత్య చేసుకున్న రైతుల గురించి ప్రస్తావించకపోవడం చూస్తే... ఆయన వాస్తవ నైజం ఏమిటనేది బయటపడిందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలతో పాటు పంట నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ జెమినీ ప్రసాద్ దేహదానం


జెమినీ ప్రసాద్ భౌతికకాయాన్ని స్వీకరిస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ఆరు దశాబ్దాల పాటు కలం పోరాటంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్ట్ నందినేని దేవప్రసాద్ అలియాస్ జెమినీ ప్రసాద్ మృతి అనంతరం ఆయన భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ నెల 6న ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్ నుంచి భారీ ర్యాలీగా బోధనాస్పత్రికి ఆయన భౌతిక కాయాన్ని జర్నలిస్టులు తరలించి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు అప్పగించారు. కళాశాలలోని అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో ఆయన శరీరాన్ని భద్రపరిచారు. అన్ని దానాల్లోకెల్లా దేహదానం చాలా గొప్పదని, ఎంతో మంచి మనసు ఉంటే తప్ప అంత గొప్ప పని చేయడం సాధ్యం కాదని ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యరావు కొనియాడారు. మానవ అంతర్ నిర్మాణ శాస్త్ర అధ్యయనానికి దేహదానం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, చల్లా నాయుడు, తలారి రామాంజినేయులు, నాగభూషణం, విశ్వనాథ్, సుధాకర్, చంద్ర, రామాంజినేయులు, శ్రీరాములు, నాగభూషణం, బోగేశ్వరరెడ్డి, నందుటైమ్స్ భాస్కరరెడ్డి, రామలింగారెడ్డి, మంజునాథ్, శ్రీనివాసరెడ్డి, 150 మందికిపైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్యాంపస్ ఇంటర్వ్యూలు


క్యాంపస్ ఇంటర్వ్యూల సందర్భంగా పరీక్ష రాస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. తొలి రోజు రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మంగళవారం కల్పతరు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ చేపట్టింది. అనంతపురం, ఉరవకొండ, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, కళ్యాణదుర్గం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొత్తం 92 మంది పాల్గొన్నారు. తొలుత రాత పరీక్షను నిర్వహించగా 64 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. తుది రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ధీరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలను సృష్టించాలి


వ్యవసాయ విద్యార్థులతో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు

శింగనమల: రైతులకు ఉపయోగపడేలా అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను సృష్టించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రెడ్డిపల్లి కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం శింగనమల మండలం నాయనవారిపల్లిలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌బీవీఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడారు. రైతులతో కలసి పంటల సాగు విధానాలు అధ్యయనం చేయడంతో పాటు నూతన సాగు విధానాలు, వంగడాలపై రైతులను చైతన్య పరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన వ్యవసాయ ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించారు. రెడ్డిపల్లి ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్.భార్గవి, ఏఆర్‌ఎస్ రేకులకుంట శాస్త్రవేత్త జి.నారాయణస్వామి, తహసీల్దార్ బ్రహ్మయ్య, గుత్తి ఏడీఏ వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, సబితా, మాధవి, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఇద్దరు యువకులు ఉన్నారు. తాను ఏమి చేస్తున్నాడో తెలియని స్థితిలో మతిస్థిమితం లేని యువకుడు, తాగుడు మానేయడం ఇష్టం లేక మరొకరు ఆత్మహత్య చేసుకోగా... కాలు నొప్పి భరించలేక ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు...


నరసప్ప (ఫైల్)


మృతుడు వెంకటేష్


మృతుడు కళ్లప్ప

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పూజారి అంజినప్ప కుమారుడు నరసప్ప(32) మతి స్థిమితం లేక ఇబ్బంది పడుతున్నాడు. 12 ఏళ్ల వయసులో ఉన్నప్పుడే తల్లిదండ్రులిద్దరూ మృతి చెందారు. పెరిగి పెద్దయిన తర్వాత డ్రైవింగ్ వృత్తితో జీవనం సాగిస్తున్న నరసప్ప... రెండేళ్ల క్రితం మతి భ్రమించి రోడ్లపై తిరగడం మొదలు పెట్టాడు. గ్రామస్తులు పెట్టింది తింటూ ఆకలిదప్పికలు తీర్చుకునేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి పైకప్పునకు తాడుతో వేసుకున్న ఉరికి వేలాడుతున్న నరసప్పను గమనించిన చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే నరసప్ప ప్రాణాలు కోల్పోయినట్లుగా నిర్ధారించుకుని పెనుకొండలోని ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

తాగుడు మానడం ఇష్టంలేక

తనకల్లు: మండలంలోని రాచువారిపల్లికి చెందిన కిష్టప్ప కుమారుడు వెంకటేష్ (31)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన తండ్రితో కలసి చేపల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న వెంకటేష్ కొన్ని రోజులుగా మద్యానికి బానిసై జులాయిగా మారాడు. తాగుడు అలవాటు మానుకుని, ఏదైనా పనిపై దృష్టి సారించి పిల్లాపాపలను సక్రమంగా చూసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనైన వెంకటేష్ మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొర్రెల దొడ్డిలో ఉరి వేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే తనకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

కాలునొప్పి భరించలేక

రొళ్ల: కాలు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రొళ్ల మండలం చిగమతిఘట్ట గ్రామానికి చెందిన గొల్ల కళ్లప్ప(63) మంగళవారం మృతి చెందాడు. నాలుగేళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఆరు నెలల క్రితం కాలి బొటనవేలికి దెబ్బ తగిలి మానలేదు. దీంతో వైద్యులు బొటనవేలు తీసి వేశారు. అప్పటి నుంచి గ్యాంగ్రీన్ నొప్పి తీవ్రమవుతూ వచ్చింది. నొప్పి భరించలేక విలవిలలాడేవాడు. ఈ క్రమంలో ఆదివారం నొప్పి తీవ్రత భరించలేక క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే శిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు తుమకూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక మంగళవారం ఆయన మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి


మృతురాలు భాగ్యమ్మ

అమరాపురం: మండలంలోని ఆగ్రహారం గ్రామానికి చెందిన భాగ్యమ్మ(68) ప్రమాదశాత్తు బావిలో పడి మృతిచెందింది. మంగళవారం ఉదయం తన పొలానికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అటవీ అధికారులకు జింక అప్పగింత


జింకను కరుణ సొసైటీకి తరలిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జింకను గ్రామీణులు కాపాడి సురక్షితంగా అటవీ అధికారులకు అప్పగించారు. ఓడీచెరువు మండలం మామిళ్లకుంట్లపల్లి వద్ద మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం రాత్రి మామిళ్లకుంట్లపల్లి – కొండకమర్ల మార్గంలో రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో గాయపడిన జింక రోడ్డు పక్కనే కుప్పకూలింది. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు గాయపడిన జింకను గుర్తించి ప్రథమ చికిత్స చేసి, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. పశు వైద్యాధికారుల వద్ద చికిత్స అనంతరం పుట్టపర్తిలోని కరుణ సొసైటీకి జింకను అప్పగించినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

పట్టపగలే చోరీ

గుత్తి: స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రాజేష్ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. మంగళవారం ఉదయం 9 గంటలకు రాజేష్ తన ఇంటికి తాళం వేసి పాఠశాల విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ ఆగంతకుడు... తాళాలు తీసి లోపలకు ప్రవేశించాడు. బీరువాలోని 15 తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరించాడు. సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకున్న రాజేష్... చోరీ విషయం గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, స్థానికుల సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టారు.

'ఎస్వీ' విద్యార్థి ఘనత


విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.యశ్వంత్‌రెడ్డి అరుదైన ఘనత సాధించాడు. వినూత్న ఆలోచనలతో తాను రూపొందించిన 'ధన్విన్ ఎకో వుడ్స్ స్టార్టప్'కు అమెరికాకు చెందిన బ్లూప్లాట్ వెంచర్స్ ఎల్ఎల్‌సీ సంస్థ దన్నుగా నిలిచింది. రూ. 45 లక్షలు పెట్టుబడి ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. వివరాలను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి వెల్లడించారు. విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందించారు. 2023లో ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టార్టప్ జాతర'లో పాల్గొన్న యశ్వంత్‌రెడ్డి రూపొందించిన ప్రాజెక్ట్ 'బెస్ట్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచిందన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం ద్వారా రూ. 5 లక్షలు పెట్టుబడి పొందాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీపీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్ భట్, కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎస్.రిజ్వానా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలుర అదృశ్యం


రాహుల్

గుంతకల్లు టౌన్: స్థానిక మోదినాబాద్‌కు చెందిన విద్యార్థులు బి.రాహుల్, పరుశురాముడు కనిపించడం లేదు. సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రాహుల్ స్కూల్‌కి సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లి ఉరుకుందమ్మ మందలించింది. దీంతో సోమవారం మధ్యాహ్నం అదే వీధికి చెందిన తన స్నేహితుడు పరుశురాముడితో కలసి స్కూల్‌కి వెళుతున్నట్లు చెప్పి బయల్దేరాడు. సాయంత్రమైన ఇద్దరూ ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం రాహుల్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు వన్‌టౌన్ పీఎస్ సీఐ మనోహన్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96821కు సమాచారమందించాలని పోలీసులు కోరారు.

రిమాండ్‌కు ఇద్దరు

ఉరవకొండ: వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహానంది తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన ఎగ్గడి నారాయణస్వామిపై గత ఏడాది డిసెంబర్ 31న రాత్రి అదే గ్రామానికి చెందిన మీనుగ వంశి, మీనుగ ఓబన్న పాత కక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేశారు. క్షతగాత్రుడి భార్య సుంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం ఉరవకొండ శివారులో తచ్చాడుతున్న వంశి, ఓబన్నను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు పుష్పావతి

అనంతపురం: మద్యం మత్తులో కుటుంబ పోషణను నిర్లక్ష్యం చేసిన భర్త వైఖరితో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న పుష్పావతి (32), రామాంజనేయులు దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు కొన్ని నెలలుగా మద్యానికి బానిసై, జులాయిగా మారాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణను పూర్తిగా విస్మరించాడు. దీంతో తాగుడు మానేసి, కుటుంబ పోషణపై దృష్టి పెట్టాలని మంగళవారం ఉదయం భార్య హితవు పలికింది. ఇది రుచించని రామాంజనేయులు ఆమెతో ఘర్షణ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన పుష్పావతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

హైకోర్టు ఉత్తర్వులు బుట్టదాఖలు

- పట్టా భూమి అని తేల్చినా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్
- వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షకట్టి రోడ్డు వేయించిన వైనం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పట్టా స్థలంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

పెనుకొండ: హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుట్టదాఖలు చేశారు. పట్టుబట్టి.. కక్షతో మంగళవారం ఉదయం ఓ పట్టా భూమిలో సీసీ రోడ్డు వేయించారు. వివరాలు... పెనుకొండ – మడకశిర మార్గంలో సర్వే నంబర్ 681లో 15 సెంట్ల స్థలం స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుధాకరరెడ్డి, పార్టీ మాజీ కన్వీనర్ శ్రీకాంతరెడ్డి, రాజశేఖరరెడ్డికు చెందిన సొంత పట్టా భూమి. అయితే ఈ స్థలంలో గతంలో కోనాపురం గ్రామానికి దారి ఉండేదని కొందరు వివాదానికి తెర లేపడంతో స్థలం యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పట్లో సర్వే చేపట్టిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సైతం అది పట్టా భూమి అని తేల్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్థల యజమానులపై రాజకీయ కక్ష కట్టిన ఓ వైద్యుడితో పాటు మరి కొందరు ఇచ్చిన అర్జీ ఆధారంగా ఆ స్థలాన్ని సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీధర్‌కు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు లేఖరాశారు. రంగంలో దిగిన సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్.భాస్కరరెడ్డి అడ్డదిడ్డంగా రోడ్డుకు మార్కింగ్ ఇచ్చేసారు. అదే వేగంతో తాడిపత్రికి చెందిన కాంట్రాక్టర్ ధనుంజయనాయుడు, పెద్దఎత్తున కూలీలు, హాట్ మిక్సింగ్ లారీలు, ఇతర యంత్ర పరికరాలతో మంగళవారం కేవలం గంటల వ్యవధిలోనే పట్టాభూమిలో సీసీ రోడ్డు వేయించేశారు. ఎస్టిమేషన్, వివరాలను కాంట్రాక్టర్‌తో విలేకరులు ఆరా తీయగా.. మున్సిపల్ అధికారులు ఆదేశాల మేరకు రోడ్డు వేస్తున్నానని తెలిపాడు.

ప్రైవేటు వ్యక్తుల స్వలాభానికే

ప్రైవేటు వ్యక్తుల స్వలాభానికే తమ సొంత పట్టా స్థలంలో అధికారులు సీసీ రోడ్డు వేయించారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుధాకరరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి ఆరోపించారు. అధికారులే నిబంధనలు ఉల్లంఘించి సీసీ రోడ్డు వేయించిన తీరును ఆక్షేపిస్తూ సుధాకరరెడ్డి స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2021లో 15 సెంట్ల స్థలాన్ని తాము కొన్నామన్నారు. అయితే మంగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హైకోర్టుకు వెళ్లడంతో 2022లో ఆ భూమిని సర్వే చేసి ప్రభుత్వ భూమి అయితే ప్రజాప్రయోజనాలకు వాడుకోవాలని, పట్టా భూమి అయితే వారి నుంచి కొనుగోలు చేసి ప్రజాప్రయోజనాలకు వినియోగించుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో 2024 ఆగస్టులో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే చేసి పట్టాభూమిగా అధికారికంగా నిర్ధారించారన్నారు. అయినా ప్రజలకు ఇబ్బంది లేకుండా తమ స్థలానికి పడమటి వైపు 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించామన్నారు. అయితే కొందరు వ్యక్తులు దురుద్దేశంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా మున్సిపల్ కమిషనర్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ గంటల వ్యవధిలోనే సీసీ రోడ్డు వేయించడం బాధాకరమన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి దౌర్జన్యాలు చూడలేదన్నారు. దీనిపై న్యాయపోరాటం సాగిస్తామన్నారు.